

గాజువాకలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భారీగా పాల్గొన్న జనం



ప్రభుత్వ మోసాలపై ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న సమన్వయకర్త దేవన్‌రెడ్డి తదితరులు



మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజలను నిలువునా ముంచిన బాబు

- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి
- 'వెన్నుపోటు దినం' ర్యాలీకి పోటెత్తిన జనం
- కూటమి సర్కారును ఎండగట్టిన ప్రజలు

గాజువాక: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో కూటమి ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కూటమి నాయకులు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతగాజువాక జంక్షన్ నుంచి జాతీయ రహదారి మీదుగా చినగంట్యాడ వందడుగుల రోడ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ హామీలను భూతద్దంలో చూపించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వెయ్యి రూపాయలకు పెన్షన్ పెంచడం తప్పితే ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఇది ప్రజలను మోసం చేయడం, దగా చేయడం, వంచించడం అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్నారన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలను వేధిస్తూ రోడ్లపై తిరగనివ్వకుండా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలపై తమ పార్టీ నాయకులు ప్రజలను చైతన్యం చేస్తుంటే భయపడి భయభ్రాంతులకు గురి చేస

ఉక్కుకు కూటమి ద్రోహం

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హామీ ఇచ్చి.. ఇప్పుడు యాజమాన్యం ఉద్యోగులను తొలగిస్తున్నా ఎందుకు టీడీపీ, జనసేన నాయకులు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా బాధ్యత తీసుకుంటానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రైవేటీకరణ చర్యలకు మద్దతుగా ఉన్నారన్నారు. రానున్న కాలంలో కూటమి పార్టీలకు తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్, భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, గుడివాడ లతీష్, పరదేశి, బోగాది సన్ని, ధర్మాల శ్రీనివాసరావు, పూర్ణ, మహాలక్ష్మి నాయుడు, డి.వి.రమణ, పల్లా చినతల్లి, భూపతిరాజు శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, చిత్రాడ రమణ, కోమటి శ్రీను, మంత్రి శంకరనారాయణ, ఎస్.ఎం.డి. గౌస్, సిరట్ల శ్రీనివాస్, షౌకత్ అలీ, రాజాన వెంకటరావు, జి.వి.రమణ, జీలకర్ర నాగేంద్ర, కటికల కల్పన తదితరులు పాల్గొన్నారు.



గాజువాక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి, వెంకట్రామయ్య తదితరులు

మోసం.. చంద్రబాబు నైజం

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమని, ఇవన్నీ ప్రజలకు మరోసారి అర్థమైందన్నారు. ఒంటరిగా పోటీ చేసి గెలవడం కష్టమని భావించి కూటమి కట్టారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను ముంచారని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే లక్షా 50వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని, ఆ డబ్బులు ఎవరికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన రూ.3 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాలకు వేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మక జీవీఎంసీకి కమిషనర్‌ను లేకుండా చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు కూటమి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేస్తున్నారే తప్పా సొంతంగా ఒక్క పనిని కూడా ఆమోదించలేకపోయారని ఎద్దేవా చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తున్నామని, ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోందన్నారు.అంతకముందు దారి పొడువునా కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని నినాదాలతో పార్టీ శ్రేణులు ఎండగట్టారు.

క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్



కొండయ్యవలసలో వృద్ధులకు సరకులు అందిస్తున్న ఏఎస్‌వో కృష్ణ

అగనంపూడి: వృద్ధులు, దివ్యాంగులు రేషన్ డిపోలకు వెళ్లాల్సిన అవసరం లేదని.. వారి ఇళ్లకే రేషన్ సరకులు అందిస్తామని ఏఎస్వో టి.కృష్ణ అన్నారు. జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడి నిర్వాసితకాలనీలు, పరిసర కాలనీల్లో 65 ఏళ్ల దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు బియ్యం ఇంటింటికీ వెళ్లి అందించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



సరస్వతికి నిత్యావసర సరకులు అందజేస్తున్న ప్రభుజీ, కృష్ణ తదితరులు

పెదగంట్యాడ: అమ్మ వాసవీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఓ మహిళకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను బుధవారం అందజేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో పెదగంట్యాడకు చెందిన ఆదిమూలం సరస్వతి అనే మహిళకు నాగమళ్ల ప్రభుజీ ఆర్థిక సాయంతో వీటిని అందజేశారు. వరదా కృష్ణ, బచ్చు అప్పలరాజు, కేసరపు సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

అగనంపూడి: గాజువాక నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1, జగ్గరాజుపేట, జేఎన్ఎన్‌యూఆర్ఎంకాలనీ, ఇందిరా కాలనీ, మంగళపాలెంలో రూ.14.41 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కాలువలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రహరీల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, తద్వారా గాజువాకను రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, అధికారులు పాల్గొన్నారు.

బైక్‌లను ఢీ కొట్టిన వ్యాను



దెబ్బతిన్న బైక్

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్‌లను వ్యాన్ ఢీ కొట్టడంతో బైక్‌లు దెబ్బతిన్నాయి. వివరాలు.. రాంనగర్ నుంచి మింది వెళ్లే మార్గంలో ఓ కార్ల కంపెనీ వద్ద బైక్‌లు పార్కింగ్ చేసి ఉన్నాయి. బుధవారం ఓ వ్యాను వేగంగా వచ్చి రోడ్డు పక్కన డివైడర్ పైకి దూసుకుపోవడంతో పాటు పార్కింగ్ చేసిన 6 బైక్‌లను ఢీ కొట్టింది. 4 బైక్‌లు స్వల్పంగా దెబ్బతినగా, రెండు బైక్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

న్యాక్ శిక్షణ కేంద్రం సందర్శన



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. పెదగంట్యాడలోని న్యాక్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ ఏఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పొందుతున్న వారితో కాసేపు ముచ్చటించారు.

కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని, గద్దెనెక్కిన దగా కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో గాజువాక నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటు దినం పేరుతో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంక్షేమం చేతగాని కూటమి ప్రభుత్వ దిగిపోవాలని నినాదాలు చేశారు. 76వ వార్డు పరిధిలోని నడుపూరు నుంచి మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. అలాగే 75వ వార్డు నుంచి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్ నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) ఆధ్వర్యంలో అగనంపూడి నుంచి వాహనాల్లో పెద్ద ఎత్తున మహిళలు, వృద్ధులు, కార్యకర్తలు తరలి వెళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు యలమంచిలి అప్పారావు, వరహా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. గాజువాకలో జరిగిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వడ్లపూడి ప్రాంతం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఇల్లపు రాము నాయకత్వంలో, 87వ వార్డు నుంచి కోమటిశ్రీనివాసరావు,బొడ్డగోవిందల ఆధ్వర్యంలో నాయకులు ప్రగడవేణుబాబు, దానప్పలు, కోమటిరమాదేవి,గోవిందరాజులు,కె.సన్యాసిరావు తదితరులు వెళ్లి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెదగంట్యాడ/అగనంపూడి/ కూర్మన్నపాలెం



వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కన్వీనర్ పూర్ణ ఆధ్వర్యంలో బయల్దేరిన నాయకులు, కార్యకర్తలు



గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బయలుదేరిన ఇల్లపురాము తదితరులు



87వ వార్డులో కోమటి శ్రీను తదితరులు



మెయిన్‌రోడ్డులో గోవింద్ తదితరులు



75వ వార్డు నుంచి గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు



76వ వార్డు నుంచి మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు

గుండెపోటుతో కళాకారుడి మృతి

- బాలకృష్ణ డూప్‌గా ఫేమస్
- శ్రీకాకుళం జిల్లా కంచిలిలో తుదిశ్వాస
- పెదగంట్యాడలో విషాదఛాయలు



బాలకృష్ణ గెటప్‌లో కల్యాణ్



కల్యాణ్ మృతదేహం



కల్యాణ్ (ఫైల్)

పెదగంట్యాడ: మండలానికి చెందిన ఓ కళాకారుడు శ్రీకాకుళం జిల్లా కంచిలిలో గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వివరాలివీ పెదగంట్యాడ మండలం దయాల్ నగర్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ఉంటున్న చొప్ప కల్యాణ్ (60) స్టేజ్ ప్రోగ్రామ్స్ ఇస్తూ ఉంటారు. అంతే కాకుండా పెదగంట్యాడ జంక్షన్‌లో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు కళారంగంపై విశేష అభిమానం ఉండడంతో వయసు మీద పడినా.. ఆ రంగాన్ని వీడలేదు.. తన అభిమాన నటుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో కళారంగంలోకి వచ్చారు. చిత్రం భళారే విచిత్రం అనే డ్యాన్స్ ట్రూప్‌ను ఏర్పాటు చేశారు. బాలకృష్ణ డూప్‌గా ఆయన అందరికీ సుపరిచితులు.. అటు శ్రీకాకుళం నుంచి ఇటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి వరకూ ఉత్సవాలు , పండగల్లో నిర్వహించే డ్యాన్స్ ప్రోగ్రామ్‌లలో బాలకృష్ణ డూప్‌గా డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించేవారని తోటి కళాకారులు చెబుతున్నారు. ఎక్కడ ఏ కార్యక్రమం ఉన్నా అక్కడకు హాజరయ్యేందుకు ఉత్సాహం చూపేవారన్నారు. అయితే ఈ నెల 3న వజ్రపు కొత్తూరు మండలం , కోమరల్తాడ గ్రామంలో జరిగిన ఉత్సవంలో రాత్రి ప్రోగ్రాం ముగించారు. బుధవారం ఉదయం అక్కడి నుంచి కంచిలి మండలం కంచిలి గ్రామానికి చేరుకున్నారు. కంచిలిలో కూడా ఓ ప్రోగ్రాం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చెరువు వద్దకు వెళ్తుండగా ఓ చెట్టు కింద ఆయన ఆకస్మాత్తుగా పడిపోయారు. దీంతో సహచరులు గమనించారు. అయితే అప్పటికే అతను మృతి చెందారని నిర్ధారించుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడు చొప్ప కల్యాణ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కాగా కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కల్యాణ్ మృతి చెందడంతో పెదగంట్యాడలో విషాదఛాయలు అలముకున్నాయి. కల్యాణ్ మృతి కళారంగానికి తీరని లోటని తోటి కళాకారులు అన్నారు. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీఎంఎస్ అధ్యక్షుడి దృష్టికి సమస్యలు



హిరణ్మయ పాండ్యాకు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: అఖిలభారత బీఎంఎస్ అధ్యక్షుడు, ఈపీఎఫ్ఓ - సీబీటీ మెంబర్ హిరణ్మయ పాండ్య విశాఖ పర్యటనలో భాగంగా బుధవారం భెల్ (హెచ్‌పీవీపీ) గెస్ట్ హౌస్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు ఆయన్ను కలిసి పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగ, కార్మికులకు సంబంధించి పీఎఫ్ డేట్ ఆఫ్ జాయినింగ్, హయ్యర్ పెన్షన్ ఇష్యూపై విరించి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్య పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. ఉద్యోగుల యూనియన్ ప్రధానకార్యదర్శి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో బీఎంఎస్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు మళ్లా జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, భెల్ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు ఐ.ముత్యాలు, ఏపీ స్టేట్ కార్యదర్శి లోవ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఎల్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పదును



కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనకు పదును పెడుతున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. వారిలో పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించారు. విద్యార్థులకు కలర్స్, పేపర్స్ అందజేసి అందమైన ఆకృతులు రూపుదిద్దేలా శిక్షణ ఇచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి సడలించాలి

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి ఎత్తేయాలని విదసం నాయకులు కోరారు. జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు బుధవారం విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు తదితరులు వినతి పత్రం అందజేశారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



దివ్యాంగ విద్యార్థులతో సుశీలారాణి తదితరులు

ఉక్కునగరం: ఉన్నంతలో సేవా కార్యక్రమాలు చేయడంలో సంతృప్తి ఉంటుందని ఉక్కునగరం సృష్టి వరల్డ్ స్కూల్ డైరెక్టర్ పి.సుశీలారాణి అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కొండకర్లలోని ఈచా ఫౌండేషన్‌లో దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వస్తువులు అందించారు. మధ్యాహ్నం భోజనం పెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేఘన కంభం, పాఠశాల సీఈవో అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడ ప్రతిష్ట పూజలు



పూజ చేస్తున్న అర్చకుడు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు బుధవారం ఉదయం విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, అకల్మష హోమం, వాస్తు హోమం, పంచగవ్యప్రాసనం, గరుడ ప్రతిష్ఠ, నీరాజనం పూజలు చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, నవకుంభారాధన, నిత్యహోమం, బలిహరణ వంటి పూజలు నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కలెక్టర్ దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై బుధవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఏయూ అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. రూల్స్‌కు వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించిన టీచింగ్ సభ్యులందరినీ పంపించాలని, దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.